ప్రదర్శనను ఉద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

భగ్గుమన్న అసంతృప్తి

- టికెట్లు దక్కని టిడిపి నేతల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహం
- సహకరిస్తారా లేదోనన్న అనుమానాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి తమ అభ్యర్థులకు సంబంధించి రెండు జాబితాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో టికెట్లు దక్కని నేతల్లో అగ్రహం వ్యక్తం అవుతోంది. వారి అనుచరుల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఎన్నికల్లో టికెట్లు ఇచ్చిన అభ్యర్థులకు టికెట్లు రాని అభ్యర్థులు సహకరిస్తారా లేదా అన్న అనుమానాలు నెలకొన్నాయి...

ప్రతిపక్ష టిడిపి తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి గతంలో తొలి జాబితాను విడుదల చేయగా తాజాగా రెండో జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలి జాబితాలో తొమ్మిది మంది అభ్యర్థులను, రెండో జాబితాలో ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేశారు. జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇప్పటి వరకూ 12 చోట్ల టిడిపి తమ అభ్యర్థులను ఖరారు చేసింది. తొలి జాబితాలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, శ్రీశైలం, పాణ్యం, కర్నూలు, కోడుమూరు, డోన్, పత్తికొండ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. రెండో జాబితాలో ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అభ్యర్థుల ప్రకటనతో టికెట్ దక్కని నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నంద్యాలలో టికెట్టును మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు కేటాయించడంతో ముందు నుంది టికెట్ ఆశించిన భూమా బ్రహ్మానందరెడ్డి భంగపడ్డారు. ఫరూక్‌ను అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి బ్రహ్మానందరెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన అనుచరుల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఆళ్లగడ్డలో టికెట్టును భూమా అఖిలప్రియకు కేటాయించడాన్ని ఎవి సుబ్బారెడ్డి ముందు నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ఎలాగైనా అఖిలప్రియను ఓడించి తీరుతామని చెబుతున్నారు. కోడుమూరులో నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న ఆకెపోగు ప్రభాకర్‌ను పక్కన పెట్టి బొగ్గుల దస్తగిరికి టిడిపి టికెట్ ఖరారు చేసింది. దీంతో ఆకెపోగు ప్రభాకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆత్మహత్యాయత్నం కూడా చేసుకున్నారు. ఆయన అనుచరుల నుంచి కూడా అసంతృప్తి వ్యక్తం అవుతోంది. డోన్‌లో గతంలో చంద్రబాబు నాయుడు ప్యాపిలి మండలం జలదుర్గంలో బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన పార్టీ కోసం ఖర్చు పెడుతూ వచ్చారు. తీరా టికెట్ మాత్రం కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి కేటాయించారు. దీంతో ధర్మవరం సుబ్బారెడ్డి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇన్నాళ్లు కష్టపడిన తనకు పార్టీ అన్యాయం చేసిందని, రెబల్‌గానైనా సరే పోటీ చేసి తీరుతానని ఆయన స్పష్టం చేశారు. ఆయన అనుచరుల్లోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఎమ్మిగనూరు టికెట్‌ను బివి.జయనాగేశ్వరరెడ్డికి కేటాయించడంతో టికెట్‌ను బిసి సామాజికవర్గానికి చెందిన వాళ్లకు కేటాయించాలని పలువురు నాయకుల్లో డిమాండ్ వ్యక్తం అవుతోంది. మంత్రాలయంలో నియోజకవర్గ ఇంఛార్జిగా ఉన్న ప్యాలకుర్తి తిక్కారెడ్డిని కాదని రాఘవేంద్రారెడ్డికి టికెట్‌ను కేటాయించారు. దీంతో తిక్కారెడ్డి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోవర్టుకు టికెట్ ఇవ్వడం తనకు బుల్లెట్ దిగిన గాయం కంటే నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోసిగిలో తిక్కారెడ్డి అనుచరులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఇలా టిడిపిలో టికెట్లు రానివారి నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. టికెట్లు రాని అభ్యర్థులు ఎన్నికల్లో టికెట్లు వచ్చిన అభ్యర్థులకు సహకరిస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సిఎఎ చట్టాన్ని తక్షణమే
ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ - సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం సిఎఎను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సిఎఎ చట్టం అమలును ఆపాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు పాతనగరం జమ్మి చెట్టు నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద ముగింపు ర్యాలీలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన దేశ సమైక్యతకు ప్రమాదకరమైన ముస్లిం మైనార్టీలను లక్ష్యం చేసుకుని ప్రకటించిన సిఎఎ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈచట్టాన్ని ప్రజా పోరాటాల వల్ల ఐదేళ్లపాటు మూలనబెట్టి ఇప్పుడు కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండగా దాని అమలు చేసే ప్రయత్నం చేయడం బిజెపి స్పష్టంగా ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు ఆడుతున్న నాటకమన్నారు. దేశంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాల్లో అశాంతి నెలకొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత ప్రాంతీయ, భాష భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టమందు సమానమే అని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలో ముస్లిం ప్రజానీకం పట్ల తీవ్రమైన వివక్షతకు గురి చేస్తుందన్నారు. ముస్లిం ప్రజలకే కాకుండా హిందువులు ఇతర ప్రజానీకానికి కూడా నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. 1955 పౌరసత్వ చట్టాన్ని కొన్ని సవరణలు చేసి ఈ పౌరసత్వ సవరణ చట్టం (2019) బిజెపి తీసుకోవచ్చిందని తెలిపారు. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమైనదని, రాజ్యాంగంలోని ఐదవ అధికరణ నుండి 11 అధికరణ వరకు పౌరసత్వం గురించిన విధివిధానాలు నిర్దేశించారని తెలిపారు. వాటి ఆధారంగా వచ్చిందే 1955 పౌరసత్వ చట్టం అనితెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదమన్నారు. లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగ స్థానంలో హిందూ రాష్ట్ర ఏర్పాటుకు ఆర్ఎస్ఎస్, బిజెపిలు చేస్తున్న ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. బిజెపి చాలా దుర్మార్గంగా ఈ చట్టాన్ని అమలు చేయడం కోసం ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న వైసిపి టిడిపి జనసేన పార్టీలు మాత్రం నోరు మెదపడం లేదంటే మైనార్టీ ప్రజల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో చాలా స్పష్టంగా అర్థం అయ్యిందని విమర్శించారు. అందుకోసమే దేశ ప్రజలందరూ మతాలకతీతంగా ఏకమై ఈ చట్టం అమలును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, అబ్దుల్లా రంగప్ప, సుభాన్, నగర నాయకులు షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ పాల్గొన్నారు.

గామాల్లోకేంద్ర బలగాల కవాతు

- స్వేచ్ఛగా ఓటు వేయాలి : సిఐ సురేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కిష్టగిరి

ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వేయాలని సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణగిరి ఎస్ఐ ఎం. చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కేంద్ర బలగాలతో క్రిష్ణగిరి మండలంలోని ఆలం కొండ చుంచు ఎర్రగుడి కోయిలకొండ కంబాలపాడు కటారికొండ చిట్యాల గ్రామాలలో కావాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీల వారు గొడవలు సృష్టించకుండా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయకుండా ఉండాలన్నారు. అలా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో జరగాలని, అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రూపు-1 హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తున్న నేపద్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. జిల్లా కేంద్రంలోని 31 పరీక్షా కేంద్రాల్లో గ్రూపు-1 పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ తో కూడిన కంట్రోల్ రూమ్‌లో 8498031434 - వెంకటేష్, 8142460214-శ్రీనివాసులు గ్రీవెన్స్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ , 08518 - 277305 ల్యాండ్ లైన్ అందుబాటులో ఉంటారన్నారు.

అనుమానస్పద లావాదేవీల కట్టడికి చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన
- పోస్టల్ సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బ్యాంకుల ద్వారా ఎటువంటి అనుమానాస్పదమైన లావాదేవీలు జరిగినా కట్టడికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకుల ద్వారా నగదు లావాదేవీలు, పోస్టల్ కార్డుల డిస్పాచ్‌పై బ్యాంకర్స్, పోస్టల్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల వ్యయ నిర్వహణ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అమలులోకి వస్తుందన్నారు. ఎప్పుడైతే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వస్తుందో అప్పటి నుంచి మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అంతా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా వారి ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్వహించాడం ఎన్నికల కమిషన్ ఉద్దేశ్యం కావడంతో బ్యాంకులు ప్రముఖంగా ఉంటాయన్నారు. అందుకుగాను బ్యాంకులు నగదు లావాదేవీలకు సంబంధించి కూడా కొన్ని నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి గత రెండు నెలలుగా లక్ష అంతకు మించిన నగదు లావాదేవీలు (డిపాజిట్/విత్ డ్రా) లేని ఖాతాలో ఉన్నట్టుండి నగదు డిపాజిట్,విత్ డ్రా చేసినట్లయితే సదరు బ్యాంకు ఖాతాను అనుమానాస్పద ఖాతాగా గుర్తించి బ్యాంకర్లు వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి దృష్టికి తీసుకొని రావాలన్నారు. అలాంటి ఖాతాలను ఎన్నికల వ్యయ నిర్వహణ సభ్యులు ఎల్‌డిఎం, నోడల్ అధికారులతో విచారణ చేయిస్తారన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల నుండి రూ.లక్ష అంతకు మించి విత్ డ్రా చేసే వారి వివరాలను కూడా గమనిస్తూ జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి డెలివరీని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా రానున్న కార్డులను కూడా పోలింగ్ రోజు నాటికి ఓటర్లందరికి ఎపిక్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి పంపే వాటి డిస్పాచ్ వివరాలు ఆర్ఓల దగ్గర ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, పత్తికొండ ఆర్‌డిఓ రామలక్ష్మి, డిఆర్ఓ మధుసూదన్‌రావు, ఎల్‌డిఎం రామచంద్రరావు, డిసిఓ రామాంజనేయులు, బ్యాంకర్స్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను పెంపొందించాలి

వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉన్నత విద్యాభ్యాస సమయంలోనే విద్యార్థులకు సామాజిక బాధ్యతను పెంపొందించేలా చర్యలు చేపట్టాలని వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలోని సమావేశ భవనంలో బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రు ఎడ్యుకేషన్ అనే కార్యక్రమంపై కళాశాల ప్రిన్సిపల్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్‌తో పాటు బిసిడిఇ సిఒ , సెక్రటరీ ఎంఎల్ఎస్ దేవకుమార్ మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సామాజిక అవగాహన కలిగి ఉన్నప్పుడే అభివృద్ధి పథంలో నడుస్తారని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థుల స్థాయిని పెంపొందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ అప్పారావు, మాస్టర్ ట్రైనర్స్ షేక్ రసూల్, రాజన్న, యూనిసెఫ్ కన్సల్టెంట్ స్వాతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విసి సుధీర్ ప్రేమ్‌కుమార్

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని రెండవ పటాలపు డిఎస్‌పి మహబూబ్ బాషా అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రెండవ పటాలపు ఆవరణలో ఉన్న సిఆర్ఆర్ఎం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై అవగాహన గోడ పత్రికలను లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. డిఎస్‌పి మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఎలాంటి కొనుగోళ్లు లావాదేవీలు చేసినా వినియోగదారులు సరి అయిన రసీదును తప్పనిసరిగా పొందాలన్నారు. లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వస్తువుల్లో లేదా ఇతర సేవల్లో నాణ్యత ,స్వచ్ఛత ,ధర సంబంధిత సమాచారం పొందే హక్కు వినియోగదారుడుకి ఉంటుందన్నారు. వినియోగదారుల హక్కుల చట్టం 2020లో ప్రస్తుత ఆధునిక మార్కెట్ విధానాలకు తగ్గట్లు ఫిర్యాదులను తీసుకునే అవకాశం కల్పించి ఫిర్యాదులను 48 గంటల్లో స్వీకరించి, నెల రోజులలోపే పరిష్కరించే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు తగు జవాబుదారీతనాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఆర్ఆర్ఎం పాఠశాల ప్రధాన అధ్యాపకులు వెంకటరెడ్డి ,పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు యశోదమ్మ ,కరీం, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

45వ వార్డులో సిసి డ్రెయిన్లకు భూమి పూజ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



కర్నూల్ నగరం 45వ వార్డు 117వ సచివాలయం పరిధిలో సిసి డ్రెయినేజీ కాలువలకు డివిఎంసి మెంబర్ కె. ప్రభుదాసు శుక్రవారం భూమి పూజ కార్యక్రమాన్ని వైసిపి నాయకులు రైల్వే ప్రసాద్, మున్సిపాలిటీ దినేష్ కుమార్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సహకారంతో రూ.24 లక్షలు డ్రెయినేజీల కోసం మంజూరు చేసినట్లు తెలిపారు. సంక్షేమం అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు స్థానిక మున్సిపల్ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు సచివాలయ సెక్రటరీలు మాధురి, మనోజ్ కుమార్ ఎస్‌కె. ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు: డిఐజి విజయరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విధుల పట్ల అలసత్వం, క్రమశిక్షణ ఉల్లంఘించిన ముగ్గురు పోలీసులను కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయ రావు సస్పెండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుస్టేషన్లను ఆశ్రయించే బాధిత ఫిర్యాదుదారుల సమస్యల పై సత్వరమే స్పందించాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పట్ల అలసత్వం , క్రమశిక్షణ ఉల్లంఘించిన ముగ్గురు పోలీసులను కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. శ్రీ విజయ రావు ఐపియస్ గారు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా అవుకు ఎఎస్ఐ ఎన్‌విఎల్ సుబ్రమణ్యం, హెచ్. నందు నాయక్, కర్నూలు జిల్లా ఆలూరు పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ ఎం. తిరుపాల్ నాయక్‌ను సస్పెండ్ చేశారు. ఒక మహిళ అవుకు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించి తన భర్త తనను శారీరకంగా , మానసికంగా వేధిస్తున్నాడని తన భర్తను పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించాలని పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. పోలీసుల ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోలేదన్నారు. ఫలితంగా ఆమె హత్యకు గురైందన్నారు. తిరుపాల్ నాయక్ , అతని కుటుంబ సభ్యులు ఏడు నెలల గర్భవతి అయిన తమ కోడలిని పెళ్లయిన సంవత్సరం లోపే అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా వేధించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. తిరుపాల్ నాయక్ కోడలు ఆత్మహత్య విషయంపై కర్నూలు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐ తిరుపాల్ నాయక్ పై కేసు నమోదు చేసిందన్నారు. కర్నూలు జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి ఇచ్చిన నివేదికల ఆధారంగా కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు ఈ ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా పోలీసులు విధుల పట్ల అలసత్వం వహించి , క్రమశిక్షణను ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈ సంధర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు హెచ్చరించారు.

టిడిపిలో చేరిన బైరెడ్డి శబరి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరి టిడిపిలో చేరారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె టిడిపిలో చేరారు. ఆమెకు చంద్రబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి నుంచి నంద్యాల ఎంపీ టికెట్ ఆశించిన ఆమె.. బిజెపి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల జయరాం, టిడిపి నేతలు పాల్గొన్నారు. బైరెడ్డి శబరికి నంద్యాల ఎంపీ టికెట్‌ను టిడిపి ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఆ హామీ మేరకే ఆమె పార్టీలో చేరినట్లు సమాచారం. బైరెడ్డి శబరి టిడిపిలో చేరడంతో బైరెడ్డి అనుచరులు జిల్లా వ్యాప్తంగా బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

బైరెడ్డి శబరికి టిడిపి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : టిజిభరత్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి తనను గెలిపించాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి టిజి భరత్ ప్రజలను కోరారు. నగరంలోని 44వ వార్డు సీతారాం నగర్‌లో ఏర్పాటుచేసిన పార్టీ చేరికల కార్యక్రమంలో వైసిపికి చెందిన యువకులు సుబ్బు, షణ్ముక్, సాయి, నవీన్, ప్రదీప్‌లు టిడిపి నాయకులు దేవా, మనోజ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిజి భరత్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిజి భరత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి తర్వాత సమస్యల పట్ల నాయకులను నిలదీయాలన్నారు. రానున్న ఎన్నికల్లో తప్పకుండా పూర్తి స్థాయిలో ఓటింగ్ శాతం నమోదవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. పార్టీ క్యాడర్ మొత్తం ప్రజలతో మాట్లాడి చైతన్యం తీసుకురావాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటాయన్నారు. ప్రజలందరి ఆశీర్వాదం తెలుగుదేశం పార్టీపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు హరిబాబు, రమేష్, శ్రీధర్, ప్రభాకర్, క్రిష్ణవేణి, జ్యోతి, సుబ్రహ్మణ్యం, సురేంద్ర రెడ్డి, లోకేష్ నాయకులు, బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్టర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కర్నూలు రూరల్ మండలం మామి డాల పాడు గ్రామం పరిధిలో సర్వేనెంబర్ 231/1సి లోని 33 సెంట్లు భూమిని అక్రమంగా చేసుకున్న రిజిస్టర్ రద్దు చేయాలని సమాచార హక్కు చట్టం నాయకులు జయన్న , బాధితుడు సత్యంలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బాధితుడు సత్యం కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయన్న మాట్లాడుతూ టిజి. భరత్ అక్రమంగా బాధితుడు సత్యం తండ్రికి చెందిన దళితుల భూమిని అక్రమంగా కబ్జా చేశారన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. బాధితుడు సత్యంకు సంబంధించిన రూ.కోట్ల విలువచేసే భూమిని ఇప్పుడు అక్రమంగా కట్టడాలను కూడా నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. అక్రమంగా టిజి. భరత్ చేసుకున్న రిజిస్టర్ రద్దుచేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అతని కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డి పట్టాలకు భద్రత లేదు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

డీ పట్టాలకు భద్రత లేదని, ప్రభుత్వం దళిత బలహీన వర్గాలకు మంజూరు చేసిన డీ పట్టాలను కర్నూలు రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో అంగట్లో సరుకుల్లా అమ్ముకుంటున్నారని బాధితులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల కార్యాలయం ఎదుట బాధితులు ఆర్.అన్నయ్య ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ 1982లో అప్పటి ప్రభుత్వం తమ నాన్నగారికి బి.తాండ్రపాడు లోని సర్వేనెంబర్ 19/1 336, 337లో మూడు సెట్ల నివాస స్థలం మంజూరు చేసి డి.పట్టా ఇచ్చారని తెలిపారు. ఈ స్థలంలో కాంపౌండ్ వాల్ కట్టుకొని గుడిసె వేసుకొని ఉన్నామన్నారు. వెంకటేష్ నాయక్ అనే వ్యక్తి నకిలీ పత్రాలు తీసుకొని గత సంవత్సరం ఫిబ్రవరిలో ఈ స్థలం తమదేనని గుడిసెను కూలగొట్టి దౌర్జన్యానికి దిగారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఆనాటి ఎస్ఐ లక్ష్మీనారాయణ ఎవరిది నిజమైన పట్టానో తేల్చాలని కర్నూలు రూరల్ తహశీల్దార్‌కు టపా పంపారని పేర్కొన్నారు. ఆనాటి నుండి జెన్యూన్ సర్టిఫికేట్ ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు అప్పుడిస్తాం ఇప్పుడు ఇస్తామంటూ కాలయాపన చేస్తూ వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ కింద దరఖాస్తు చేసినా ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. గతంలో వచ్చిన వరదల్లో ఫైళ్లు కొట్టుకుపోయాయని, పాత ఫైళ్లు వెతకాలంటే కొద్దిగా సమయం పడుతుందని కబుర్లు చెబుతూ వచ్చారని పేర్కొన్నారు. విఆర్ఓ ఇతర అధికారులు అక్రమార్కుల నుండి డబ్బు తీసుకుని పట్టాలను ఇష్టానుసారం అమ్ముకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేసి మూలా ఆగడాలనరికట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా శాంతి యుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి సమక్షంలో గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పెద్దతుంబలం పోలీసు స్టేషన్ పరిధిలో హానవాలు, జి.హోసల్లి, కడితోట గ్రామాల్లో పురవీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తాలూకా పరిధిలో కొన్ని గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బందోబస్తు మాత్రమే కాకుండా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్టుల్లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, ఆదోని తాలూకా, పెద్దతుంబలం, ఇస్వి ఎస్ఐలు ఎర్రిస్వామి, చిన్నపీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పోటీల్లో పాల్గొన్న వృషభాలు

మండలంలోని బాపురం గ్రామంలో వెలిసిన శ్రీగంగాభవాని దేవి రథోత్సవం సందర్భంగా శుక్రవారం బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. పోటీలను దేవాలయ పీఠాధిపతి బసిలింగమ్మ ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కాడెద్దులు పోటాపోటీగా బలాబలాలను నిరూపించాయి. చివరికి డోన్ ప్రాంతానికి చెందిన రైతు ఆళ్ల దామోదర్ రెడ్డి కాడి దాదాపు 4435.5 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచిం ది. వీరికి రూ.26 వేల నగదును అందజేశారు. కల్లుకుంట గ్రామానికి చెందిన రైతు అడివప్ప కాడి 4294.8 అడుగులు లాగి రెండో స్థానంలో నిలువగా రూ.20 వేలు అందజేశారు. మేకడోణ గ్రామానికి చెందిన షేర్ ఖాన్ పటేల్ కాడి 4294.3 అడుగులు లాగి మూడో స్థానంలో నిలువగా రూ.15 వేలు అందజేశారు. విజేతలకు పీఠాధిపతి బసిలింగమ్మవ్వ బహుమతులను అందజేశారు. నిర్వాహకులు హనుమంతు, నరసింహ మూర్తి, హనుమంతురెడ్డి, వీరేష్ గౌడ్, తెలుగు వీరేష్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐఎంఎ, సాయి కృష్ణ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ప్రపంచ నీటి శుక్లాల వారోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదోనిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 40 మంది వృద్ధులను ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ కృష్ణమూర్తి పరీక్షించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ నీటి శుక్లం వ్యాధి కనుగొనడం కష్టమన్నారు. కన్ను నలతగా ఉన్నా కంటి డాక్టర్లను సంప్రదించి టోనో మీటర్ పరికరంతో కంటి పరీక్ష చేసి నిర్ధారిస్తారన్నారు. తొలి దశ ఉంటే మందుల ద్వారా లేదా ఆపరేషన్ ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ముదిరితే నరాలు దెబ్బతిని కంటిచూపు పూర్తిగా పోయే ప్రమాదముందన్నారు. ఐఎంఎ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ గోపీనాథ్, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఫిలిప్స్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- దేవనకొండ

అవగాహన కల్పిస్తున్న రామ్మోహన్

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కెపిఆర్ మైత్రి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కెపిఆర్ మైత్రి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. పరీక్షలపై భయం లేకుండా క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు వచ్చే విధంగా రాయాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, జామెంట్రీ బాక్స్ అందజేశారు. ఎంఇఓలు తిమ్మారెడ్డి, విజయనిర్మల దేవి, ప్రధానోపాధ్యాయులు వి.ప్రశాంతి, ఉపాధ్యాయులు గోకారి, డాక్టర్ లక్ష్మణ్ స్వామి పాల్గొన్నారు.

చంద్రబాబు చుట్టూ ఉన్న

జగన్ కోవర్టుల వల్లే నాకు అన్యాయం

- బాలనాగిరెడ్డి కోవర్టే రాఘవేంద్రా రెడ్డి - టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చుట్టూ ఉన్న వైఎస్.జగన్ కోవర్టులు, బ్రోకర్ల వల్లే తనకు టికెట్ రాకుండా అన్యాయం చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థిగా రాఘవేంద్రా రెడ్డిని ప్రకటించడంతో తిక్కారెడ్డి గ్రూపు నిరసనలు వ్యక్తం చేసింది. శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి స్వగృహంలో పన్నగ వెంకటేశప్ప స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు మాట్లాడారు. పార్టీ కష్ట కాలంలో నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటూ తిక్కారెడ్డి కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. ఆయనకు టికెట్ ఇవ్వకుండా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోవర్టుకు ఇవ్వడం సరికాదన్నారు. గెలుపు గుర్రాన్ని వదిలి ఓడిపోయే వారికి టికెట్ ఇవ్వడం వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అధిష్టానం కళ్లు తెరవకపోతే టిడిపి రెబల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేయాలని తిక్కారెడ్డిని కోరారు. మూడు నెలలు ముందు వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన వైసిపి కోవర్టుకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన తిక్కారెడ్డి మాట్లాడారు. 'మీరు అండగా ఉన్నంత వరకు నేను వెనుకడుగు వేయను' అని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా అసెంబ్లీకి పోటీ చేస్తానని తెలిపారు. చంద్రబాబు పునరాలోచన చేస్తారని చెప్పారు. నాటి ఎన్నికల్లో జరిగిన బుల్లెట్ గాయం బాధ కంటే నేడు పార్టీ తీసుకున్న నిర్ణయం చాలా బాధ అనిపించిందని తెలిపారు. అనంతరం పన్నగ వెంకటేశప్ప స్వామి ఇంటి నుంచి శ్రీరాఘవేంద్ర స్వామి సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి టైర్లకు అగ్ని పెట్టి నిరసన వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప డేని, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, సీనియర్ నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, బాపురం శివమోహన్ రెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు బాపురం సుధీర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, సాయి కుమార్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, సిద్ధప్ప గౌడ్, బీసీ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బీసీ సీనియర్ నాయకులు చావిడి వెంకటేష్, నాడిగేని అయ్యన్న, వక్రాని వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, రెహ్మాన్, పంపాపతి, కొండగేని వీరారెడ్డి, చిన్న బొంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణా రెడ్డి, పల్లెపాడు మాజీ సర్పంచి చంద్ర, చిలకలడోన మాజీ సర్పంచి హనుమంతు, గవిగట్టు ఈరయ్య, గుండాల ఈరయ్య, గుండేష్, రంగారెడ్డి, గోపాల్, శీను, నర్సారెడ్డి, మాలపల్లి చంద్ర, వగరూరు అబ్దుల్, జనార్ధన్, నాడిగేని వీరారెడ్డి, నర్సారెడ్డి, కప్పయ్య, డీలర్ నరసన్న, లక్ష్మారి నరసింహులు, రామయ్య, డాక్టర్ రాజానంద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజాబాబు, ఏబు, సురేంద్ర, రామయ్య, వీరేష్, రాజు, దేవన్న, బసవలింగప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ప్రదర్శన చేపడుతున్న నాయకులు

బీవీకి పూలమాల వేసి అభినందిస్తున్న గురుస్వామి

బీవీకి అత్యధిక మెజార్టీ తేవడమే లక్ష్యం

- టిడిపి సీనియర్ నాయకులు బండే గురు

ప్రజాశక్తి - నందవరం

రానున్న ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు పూలచింత బండే గురు స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన బీవీని కలిసి పూలమాల వేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరూ ఊహించిన విధంగానే బీవీకి ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని, కార్యకర్తలు ఆనందంలో ఉన్నారని తెలిపారు. ఈ ఆనందాన్ని కొనసాగించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం కృషి చేయాలని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేసింది కేవలం టిడిపి ప్రభుత్వం, బీవీ.మోహన్ రెడ్డి కుటుంబమేనని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యేగా బీవీ.జయనాగేశ్వర రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తే మెజార్టీ సాధించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి బీవీని ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిగా చూసేందుకు నడుంబించాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు షరీఫ్, బంగారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పదో తరగతి పరీక్షలు మొదలవుతున్న సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎస్‌టియు జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ పి.నాగేంద్రప్ప, నారాయణ, వెంకటేష్ కోరారు. శుక్రవారం డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి పరీక్షల కేంద్రాల్లో నీటి సరఫరా, ఫర్నీచర్, స్టేషనరీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని సమస్యలకు ప్రభుత్వ సహకారంతో ఏర్పాట్లు చేస్తామని డిప్యూటీ డిఇఒ హామీ ఇచ్చారు.

ఘనంగా గిరక బండి పోటీలు

- బహుమతులు ప్రదానం చేసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీమారికాంబ దేవి కుంభోత్సవం సందర్భంగా కౌతాళంలో గిరక బండి పోటీలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద చారి మాట్లాడుతూ... గ్రామీణ క్రీడలకు వైభవం తీసుకొచ్చే క్రీడా గిరక బండి పోటీలని పేర్కొన్నారు. ఈ క్రీడలు స్ఫూర్తిగా తీసుకోవాలని, గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే స్నేహభావాలు పెరుగుతాయన్నారు. ఈ పోటీల సందర్భంగా రైతులతో పాటు నిర్వాహకులను సన్మానించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు (నగదును) అందజేశారు. ఈ మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన కోతడం గ్రామానికి చెందిన జమ్మలదిన్నె గాదిలింగకు మొదటి బహుమతి కింద రూ.25 వేలు, ఇదే గ్రామానికి చెందిన కబాడీ హరీష్‌కు రెండో బహుమతి రూ.20 వేలు, గ్రామానికి చెందిన హుసేనికి మూడో బహుమతి కింద రూ.15 వేలు, ఉరుకుంద గ్రామానికి చెందిన అల్లప్పకు నాలుగో బహుమతి రూ.10 వేలు, రౌడూరు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి ఐదో బహుమతి రూ.5 వేల నగదును అందజేశారు. సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, నాయకులు చౌదరి బసవరాజు, వడ్డే రామన్న పాల్గొన్నారు.

గిరక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నాయకులు

కోరం కోసం ఎదురుచూపులు

- అరగంటలో ముగిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

పురవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో చర్చించి పరిష్కార దిశగా పాటుపడాల్సిన కౌన్సిలర్లు కౌన్సిల్‌కు డుమ్మా కొడుతున్నారు. సమావేశంలో సమస్యలు లేవనెత్తినా పరిష్కరించే వారే కరవయ్యారని, వెళ్లినా, వెళ్లకపోయినా ఒరిగేదేమీ లేదని కొందరు బాహాటంగానే చెబుతున్న పరిస్థితి.

కోరం కోసం ఎదురుచూపులు

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డులు ఉన్నాయి. అందులో ఒకటి టిడిపి, 41 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. 11 గంటలకు సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా 10 మంది మాత్రమే వచ్చారు. మిగతా వారికి ఫోన్లు చేసి సమావేశానికి హాజరయ్యేలా కౌన్సిలర్లు ప్రయత్నం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటికి 22 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో సమావేశం సాగింది. మున్సిపల్ ఛైర్మన్ శాంత అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. 31 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ఉంచారు. రోడ్లు, డ్రెయినేజీ, అభివృద్ధి పనులు, పెండింగ్ పనులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించగా 'పాస్.. పాస్' అంటూ అరగంటలో ముగించేశారు. అంతకుముందు కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... లక్షలాది రూపాయలు వెచ్చించి 140 వాకిటాకీలు కొనుగోలు చేశారని, అవి నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్లు ఉండగా ఉద్యోగులకు వాకిటాకీలు ఇవ్వాల్సిన అవసరం ఏముందని, ప్రజాధనం దుర్వినియోగం కాదా అంటూ ప్రశ్నించారు. వాటిని విక్రయించి వచ్చిన ధనంతో అభివృద్ధి పనులకు వెచ్చించాలని కోరారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో తాగునీరు వదలడం వల్ల ఆ ప్రాంతవాసులు మేల్కోవాల్సి వస్తోందన్నారు. ఉదయం పూట నీరు వదిలే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది రాత్రి వేళలోనే పైపు లైన్ వాలు ఓపెన్‌గా ఉంచడం వల్ల కొన్ని కుళాయిలకు మూత లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని, కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... పథకాల కింద ఇంటి పట్టా మంజూరైన వారికి రిజిస్ట్రేషన్ చేయడం లేదని కమిషనర్ రామచంద్ర రెడ్డి దృష్టికి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా టెక్నికల్ సమస్య ఉందని కమిషనర్ వివరించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, ఇంతియాజ్, వసీం, పార్వతి, భారతి, చలపతి, మహేశ్వరి, చిన్న, సురేష్, వికె.కీర్తన, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క, టిడిపి కౌన్సిలర్ పార్వతి, మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్లు రఘునాథరెడ్డి, రాజు నాయక్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజినీర్లు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్ ఉన్నారు.

సభ్యుల కోసం వేచి చూస్తున్న కౌన్సిలర్లు


బాబును కలిసిన మీనాక్షి నాయుడు

బాబును కలిసిన మీనాక్షి

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కొంకా మీనాక్షి నాయుడు శుక్రవారం విజయవాడలో కలిశారు. ఆదోని పరిస్థితులను వివరించగా సావధానంగా విని సానుకూలంగా స్పందించారన్నారు. 'ఆదోనిలో గెలిచే అభ్యర్థి నువ్వే. కచ్చితంగా ఆదోని సీటు నీకు వచ్చేలా అందరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామ'ని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదోని టికెట్ మీనాక్షి నాయుడుకే వస్తుందని ధీమాగా ఉన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్విలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 11వ తరగతుల్లో 40, 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం హాలహర్విలో సంప్రదించాలని తెలిపారు.

పట్టణాభివృద్ధికి ప్రణాళికతో ముందుకెళ్తాం

- బుట్టా రేణుక ఎర్రకోట, జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధిని ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం 11వ వార్డులో జనరల్ ఫండ్ కింద రూ.11 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. నాయకులు బుట్టా శివనీలకంఠ పాల్గొన్నారు.

భూమి పూజ నిర్వహిస్తున్న నాయకులు

సిఎం సహాయ నిధి మంజూరు

ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సిఎం సహాయనిధి కింద రూ.9.50 లక్షల చెక్కులు మంజూరైనట్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తెలిపారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయం (శిల్పా ఎస్టేట్)లో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు గొల్ల హరిత రూ.30 వేలు, చాకలి శిరీష రూ.లక్ష, మందుల రవి రూ.3 లక్షలు, వడ్డే పద్మ రూ.90 వేలు, జయరామి రెడ్డి రూ.1.30లక్షలు, సోమిరెడ్డి రూ.3 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి సమస్యను వివరించినట్లు చెప్పారు. వెంటనే చెక్కులు మంజూరు చేయాలని ఆదేశించారు.

చెక్కులను అందిస్తున్న బుట్టా రేణుక

పైపువాలును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

భైరవకుంటలో తాగునీటి ఎద్దడి

- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని భైరవానికుంట గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి సరఫరా అయ్యే రక్షిత నీటి పథకం పైపు లైన్ వాలును కొందరు ధ్వంసం చేయడంతో నీటి సరఫరా బంద్ అయింది. నీటి సరఫరాను పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గీతను వివరణ కోరగా... ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లి పైపులైన్ వాలుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పంట నష్టపరిహారం జమ చేయాలి

- అధికారులకు రైతుసంఘం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి నేటికీ నష్ట పరిహారం ఇవ్వలేదని, తక్షణమే రైతుల బ్యాంకు ఖాతాలకు పరిహారం జమ చేయాలని ఎపి రైతు సంఘం మండల గౌరవాధ్యక్షులు వై.కండప్ప, మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎఇఒ యోగి, విఎఎ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు వీరస్వామి, రైతు సంఘం నాయకులు బాషా, మధు, కోదండ, శ్రీనివాసులు, మద్దిలేటి, నరసన్న, రామాంజి పాల్గొన్నారు.

రమేష్ యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

- యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

సామాజిక సేవలో ముందుండే రమేష్ యాదవ్‌కు ఆదోని ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ఉసేనప్ప యాదవ్ కోరారు. శుక్రవారం వారి కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారి ఓట్లు అధిక శాతంలో ఉన్నాయని తెలిపారు. యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రమేష్ యాదవ్ బాధ్యతలు నిర్వర్తిస్తూ బహుజనుల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చారని చెప్పారు. వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటూ ఎందరికో తక్కువ ఖర్చులతో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో తక్కువ చార్జీలకే వైద్యం అందిస్తూ పేదలకు, అభాగ్యులకు లక్షలాది రూపాయలు వెచ్చించి నిత్యావసర సరుకులు అందించారని చెప్పారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ద్వారా ఆర్యవైశ్యులకు ఇప్పటికే కర్నూలు సీటు ఇచ్చారని, మళ్లీ ఆదోని కూడా కేటాయించడం సమంజసం కాదని తెలిపారు.

మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు సీజ్

పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ప్రజాశక్తి - నందవరం

ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని, సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.తిమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని నది కైరవాడి గ్రామ బయట తుంగభద్ర నది నుంచి నాలుగు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. ఎవరైనా ఇసుక కావాల్సిన వారు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనల మేరకు చలానా రూపంలోనే డబ్బులు చెల్లించి, ఇసుకను తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించడానికి ప్రయత్నం చేస్తే అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయంలో ఉన్న బీవీ, నాయకులు

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామిని టిడిపి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని, అనంతరం శ్రీగురురాఘవేంద్ర స్వామి వారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థుల దగ్గర ఆశీర్వాదం పొందారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

- ఎమ్‌డి.హాళ్లి సర్పంచి సుధాకర్

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు పంపిణీ

ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - హోళగుంద

విద్యార్థులు పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా రాయాలని ఎమ్‌డి.హాళ్లి సర్పంచి సుధాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఇంగలదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తున్న సందర్భంగా పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లను సర్పంచి సుధాకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు వారి భవిష్యత్తులో ఇది మొదటి మెట్టు అని, ఈ మొదటి మెట్టులో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా వచ్చిన సమాధానాలను వచ్చినట్టు ముందుగా రాయాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, ఆరోగ్యం పరంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

In the court of the 2nd Addl District judge
Kurnool at Adoni
O.S.No. 16/2023

Between.
Kuruva Ramakka and another. ...Plaintiffs
And
Kuruva Bharathi and others. ...Defendants
To
11. C.Veerabhadrapa son of Nagendrappa,
H. No.20/74/2, Raichoti Ramaiah colony,
Behind Milton School. Adoni

The plaintiffs have filed the above suit for partition ad separate possession of their respective shares against you and the same is posted to 03-04-2024 for your appearance. You are hereby directed to appear in person or through pleader on the aforesaid date at 10-30 A.M., failing which you will be set exparte

Sd/- G.V.Desai
Advocate for plaintiffs.